క్లుప్తంగా

ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


రమేష్‌బాబు, అధ్యక్షుడు

పరకాల : ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా జర్నలిస్టులు సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోరె రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా చొల్లేటి సునేందర్, గడ్డం బాలరాజు, ప్రధానకార్యదర్శిగా కానుగుల కరుణాకర్, కోశాధికారిగా చిర్ర సతీష్, సహాయ కార్యదర్శులుగా కోడెపాక భాస్కర్, బండారి గిరిప్రసాద్, కార్యవర్గసభ్యులు గాదె శ్రీధర్, మంచికట్ల ప్రభాకర్, రాజు, దూలం శ్రీనివాస్, పంచగిరి సుమంత్, అంకేశ్వరపు అయిలయ్య ఎన్నికయ్యారు. పరకాల జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

కల్యాణానికి గోటితో ఒలచిన తలంబ్రాలు



ఆత్మకూరు : సీతారాముల కల్యాణానికి గోటితో ఒలచిన తలంబ్రాలు ఉపయోగించనున్నట్లు అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు రాములుస్వామి తెలిపారు. సోమవారం తలంబ్రాల కోసం ధాన్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాల భక్తుల నుంచి తలంబ్రాలు స్వీకరిస్తామన్నారు. దేవేందర్‌రెడ్డి, రూపాదేవి, రాణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన పానుగోటి రమణాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2006 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, తేజ యూత్ సభ్యులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందించారు.

స్వీప్ పోటీల విజేతలకు అభినందన



వరంగల్ అర్బన్ : ప్రజాస్వామ్య విజయం, ఓటు హక్కు వినియోగంపై పౌరులను చైతన్యవంతులను చేసి, అవకతవకలను అరికట్టడంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గ్రేటర్ వరంగల్ ఇన్‌చార్జ్ కమిషనర్, హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అభినందించి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, జిల్లా విద్యాధికారి డాక్టర్ అబ్దుల్‌హై, జిల్లా కోఆర్డినేటర్ (ఐఈ) బోయినపల్లి రాధ, జిల్లా పోటీల సమన్వయకర్త అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నడికూడ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని రాయపర్తిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తికి చెందిన కండె పద్మ సోమవారం ఉదయం కూలీ పనులకు వెళ్లింది. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయినా అదుపుగాకపోవడంతో పరకాల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సామగ్రితో పాటు, ఒరిజనల్ సర్టిఫికెట్లు, రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. అధికారుల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించి ఆదుకోవాలి కోరారు.

నకోలి శ్యామలమాత అలంకరణలో సరస్వతి

కాజీపేట: శ్యామల నవరాత్రోత్సవాల్లో భాగంగా కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో జ్ఞాన సరస్వతి అమ్మవారిని నకోలి శ్యామలమాతగా సోమవారం అలంకరించారు. సరస్వతి, గాయత్రిదేవీలను సావిత్రి మూలమంత్రంతో హవనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి మేడారం వెళ్తున్న భక్తులు.. శ్వేతార్క మూలగణపతి ఆలయం దర్శించుకుని పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

వందశాతం ఉత్తీర్ణతే టార్గెట్

- ప్రభుత్వ పాఠశాలల్లో 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన


కేజీబీవీలో ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థినులు

ఎల్కతుర్తి : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు త్వరలో జరగనున్న పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గతేడాది డిసెంబర్ 11వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు ఒకపూట మాత్రమే ప్రారంభం కాగా, జనవరి 02 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు నిర్వహించాలని ఉన్నత అధికారులు ఆదేశించారు. దీంతో ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ తరగతులే కాకుండా అదనంగా రోజుకు రెండు గంటలు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8:30 నుంచి 9:30వరకు, సాయంత్రం 4:30నుంచి 5:45 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్నారు.

అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాదించేలా..

ఎల్కతుర్తి మండలంలో మొత్తం 19గ్రామ పంచాయతీలకు గాను మరో 3అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇందులో 38 ప్రభుత్వ పాఠశాలల్లో 349 మంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలురు 119, బాలికలు 230 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా రానున్న వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు జనవరి 02నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల దృష్టిని పుస్తకాల వైపు మళ్లిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రొత్సహిస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి సబ్జెక్టులను రివిజన్ చేస్తున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు టెస్టు పరీక్షలు నిర్వహించి వారి సమార్థ్యాన్ని తెలుసుకుంటున్నారు. విద్యార్థుల సామార్థ్యాన్ని బట్టి మరింత శ్రద్ధ వహిస్తున్నామని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వెల్లడించారు. పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను గెస్ చేసి మరీ విద్యార్థులతో చదివిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యపై మరింత నమ్మకం కలిగించే విధంగా రిజల్ట్ సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు వారు తెలిపారు. త్వరలో జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలనే టార్గెట్‌ను రీచ్ అవుతామని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంటున్నారు.

మంచి మార్కులు సాధిస్తాం



మా పాఠశాలలో ఉపాధ్యాయుల కృషితో ప్రత్యేక తరగుతులు జరుగుతున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండడంతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం చాలా మంచిదనిపిస్తోంది. చదువుపై ఏకాగ్రత వహించి మంచి మార్కులు సాధిస్తాం. ప్రతీ సబ్జెక్టుపై పట్టు సాధించేలా రోజువారి టెస్టులు నిర్వహిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. మంచి మార్కులు సాధించి వారి పేరును నిలబెడుతాం.

– సాయి హరిణి, 10వ తరగతి (కేజీబీవీ)

రివిజన్ చేస్తున్నారు



రెగ్యులర్ క్లాసులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహించడం వలన పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. ప్రతీ సబ్జెక్ట్‌పై టెస్టు నిర్వహించి అర్థమయ్యే రీతిలో మళ్లీ రివిజన్ చేస్తున్నారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా క్లాసులకు అటెండ్ అవుతున్నం.

– రిషశ్రీ, 10వ తరగతి (కేజీబీవీ)

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మా పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం టెస్టులు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రోత్సహిస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను ఇప్పటి నుంచే తీర్చిదిద్దుతున్నాం.

– అనితాదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఎల్కతుర్తి

సీపీని కలిసిన రంజిత్‌రావు


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

శాయంపేట : సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.రంజిత్‌రావు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

సీఐని కలిసిన నాయకులు


సీఐని కలిసిన నాయకులు

ధర్మసాగర్ : సీఐగా బాధ్యతలు చేపట్టిన విశ్వేశ్వర్‌ను స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు బొడ్డు దయాకర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతిసాగర్, నాయకులు శ్రీనివాస్, శివ, కల్యాణ్, కమలాకర్, సైమన్, రాజు, అన్వేష్ ఉన్నారు.

'మొగిలి'కి బెస్టు కరాటే మాస్టర్ అవార్డు


సుమన్ చేతుల అవార్డు అందుకుంటున్న మొగిలి

కమలాపూర్ : మండలంలోని కన్నూర్ గ్రామానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధానకార్యదర్శి ఇనిగాల మొగిలి బెస్టు కరాటే మాస్టర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సినీనటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 30 సంవత్సరాలుగా మార్షల్‌ఆర్ట్స్‌లో దాదాపు పదివేల మంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది, 70 క్యాంపులు నిర్వహించి శిక్షణ ఇచ్చినందుకు బెస్టు మాస్టర్‌గా జ్యూరీ సభ్యులు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. నర్సంపేటలో జరిగిన జాతీయ స్థాయి మార్షల్‌ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన సినీనటుడు, మార్షల్‌ఆర్ట్స్ లెజెండ్ సుమన్ చేతుల మీదుగా ఉత్తమ తైక్వాండో మాస్టర్ – 2024 అవార్డు అదుకోవడంతో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మార్షల్‌ఆర్ట్స్ జిల్లా అసోసియేషన్ మాస్టర్లు, జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, కన్నూర్ గ్రామ ప్రజాప్రతినిధులు, హర్షం వ్యక్తం చేశారు. మొగిలి మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

హుండీ లెక్కింపు



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారు గట్టు మల్లికార్జునస్వామి హుండీని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. హుండీలు, టిక్కెట్ల ద్వారా ఐదు నెలల కాలానికి రూ.లక్ష 52 వేల 530 వచ్చినట్లు ఆయన తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ పరిశీలకుడు సంజీవరెడ్డి ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయురాలికి సన్మానం


ప్రసన్నను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు విజయవంతమైన సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రసన్నను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంగళ మురళి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మప్రకాశ్ మాట్లాడుతూ.. ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీలోని వివిధ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటూ గ్రామంలోని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అందరం కలిసికట్టుగా తోడ్పాటు నందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు శివరతం సింగ్, భారతి, ఉపాధ్యాయులు లత, పద్మజ, రాజమ్మ, సరస్వతి, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మార్కండేయ జయంతి


ఆత్మకూరు : జయంతిలో పాల్గొన్న భక్తులు


ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న నాయకులు


శాయంపేట : పూజలో పాల్గొన్న భక్తులు

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర

ఆత్మకూరు : భక్త మార్కండేయ జయంతిని మండల కేంద్రంలోని పద్మశాలి మార్కండేయ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. పద్మశాలిసేవా భవనంలో బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడమ భక్త మార్కండేయుని ఆహ్వానించి పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ చందా, లింగయ్య హాజరయ్యారు. మార్కండేయకు నైవేద్యంగా సమర్పించిన మహా అన్న ప్రసాదాన్ని భక్తులందరూ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిని మండల అధ్యక్షుడు, కులసంఘ పెద్దలు సన్మానించారు. భక్త మార్కండేయ శోభయాత్ర నిర్వహించారు. సంఘ సభ్యులు, కులసంఘ పెద్దలు మహిళలు, యూత్ సభ్యులు కోలాటలతో డీజే పాటలతో, నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సలహాదారుడు డాక్టర్ చంద్రమోహన్, పద్మశాలి మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు రంజిత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, పద్మశాలి సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధానకార్యదర్శి కేదారి, కోశాధికారి రవి, కుల సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో భక్తమార్కండేయ జయంతిని సోమవారం పద్మశాలీ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో భక్తమార్కండేయ జయంతిని పురస్కరించుకుని భక్తమార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మి, రమేష్, ఐలయ్య, భిక్షపతి, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : పద్మశాలీల ఆరాధ్యదైవం శ్రీశివభక్త మార్కండేయ మహర్షి జయంతిని మండల కేంద్రంలోని శివమార్కండేయ ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మార్త రాజ్‌కుమార్ స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చన, వైభవ వ్రతం, హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, చేనేత సొసైటీ పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, సభ్యులు బూర లక్ష్మీ నారాయణ, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడమే రెడ్‌క్రాస్ లక్ష్యం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ డాక్టర్లు

దామెర : పేదలకు వైద్య సేవలందించడమే రెడ్‌క్రాస్ లక్ష్యమని రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసారావు, జిల్లా పాలకవర్గ సభ్యుడు బిళ్ల రమణారెడ్డి అన్నారు. మండలంలోని లాదెళ్ల గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా వారు హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో 60సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్దనే సేవలందించేందుకు హనుమకొండ రెడ్‌క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతినెల గ్రామాల్లో క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలను గ్రామంలోని వృద్ధులు వినియోగించుకోవాలని కోరారు. రెడ్‌క్రాస్ డాక్టర్లు అనిల్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, తహర్‌మసూద్, సిబ్బంది శివకుమార్, సాగర్, పవన్, నరసింహాచారి, శ్రీకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ వార్షిక బ్రహ్మోత్సవాలు


పారాయణం చేస్తున్న కమిటీ సభ్యులు

హన్మకొండ: హనుమకొండ స్నేహనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మూడు రోజులపాటు జరగనున్న సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు యాజ్ఞిక బ్రహ్మ శ్రీమాన్ వి.ఎస్.దేశికన్ స్వామి, ఆలయ అర్చకుడు అనంత వెంకటేశ్వర్లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7గంటలకు మూలమూర్తికి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, దేవతాహ్వానం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అవధూతేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం నిత్య హోమాలు, మంగళ శాసనం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో స్నేహనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ కుసుంబ వెంకట్రాం నర్సింహారావు, కమిటీల ప్రతినిధులు భట్టు శశికాంత్ రెడ్డి, ఎన్నమనేని చలపతిరావు, తంగళ్లపల్లి రామబ్రహ్మం, కాటుక బాలరాజు, గుండా వాసుదేవ్, నెలకుర్తి నారాయణ రెడ్డి, మంగు నవీన్, వివిధ కాలనీల భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

కాజీపేట రూరల్: కాజీపేట బోడగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆన్‌లైన్ తరగతులకు సోమవారం టీవీని బహూకరించారు. బోడగుట్ట ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ రఘోత్తంరెడ్డి, ఉపాధ్యాయుడు బి.కిరణ్‌రెడ్డి, ఆయన స్నేహితులు కలిసి సుమారు రూ.35 వేల విలువగల ఎల్ఈడీ టీవీని పాఠశాల కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి, మండల్ నోడల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, కాజీపేట మండల పీఆర్టీయూ ప్రెసిడెంట్ మాలకొండారెడ్డి సమక్షంలో అందించారు. అలాగే, హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోడగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి అభిరాంకు పలువురు ఆర్థికసాయం అందజేశారు. బి.సంధ్యారాణి, మనోజ్‌కుమార్, స్పుత్నిక్ రూ.5 వేల చొప్పున, మాలకొండారెడ్డి, సునీత రూ.3 వేల చొప్పున ఆర్థిక చేయూతనందించారు.

దళిత సమ్మేళనానికి భారీగా తరలిరావాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు : ఈనెల 16వ తేదీన పరకాలలో జరిగే దళితుల ఆత్మీయ సమ్మేళనానికి దళితులు తరలిరావాలని దళిత హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బొచ్చు దిలీప్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దళితులకు కేటాయించిన బడ్జెట్ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందాలిస్న నిధులను ఇవ్వకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం జరిగిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు కేటాయించిన బడ్జెటే ఉదాహరణ అన్నారు. దళితులను చిన్నచూపు చూసిన బీఆర్‌ఎస్ పార్టీని రాబోయే ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో బొంద పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం సభ్యులు పెరుమండ్ల శ్రీనివాస్, బరుపట్ల కిరీటి, మంద చంద్రమోహన్, కోకిల చక్రపాణి, భిక్షపతి, మధుకర్, కుమార్, కుమార్, శ్రీను, పోతుగంటి ఇందిరా పాల్గొన్నారు.

నేడు రౌతు మనోహర్ వర్ధంతి సభ

పరకాల : భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నాయకుడు రౌతు మనోహర్ వర్ధంతి సభను పరకాల వ్యవసాయ మార్కెట్ స్థూపం వద్ద నిర్వహించడం జరుగుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.తిరుపతి ప్రకటనలో తెలిపారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా గ్రామ దేవత ప్రతిష్ఠాపన


హోమం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ సమీపంలో, నెహ్రూ సెంటర్ ప్రాంతాల్లో గ్రామ దేవత బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి యోగానంద్, పర్యవేక్షణ కమిటీ కన్వీనర్లు కేడల జనార్దన్, సమన్వయ కమిటీ కన్వీనర్ గుండు పూర్ణచందర్ ఆధ్వర్యంలో వేద పండితులు వెలిదె నరసింహామూర్తి, వెలిదె ప్రభాకర్ శాస్త్రి, వెలిదె భార్గవశర్మ, ప్రదీప్ శాస్త్రి నేతృత్వంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు, కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, సర్వప్రాయశ్చిత్తం, ద్వారతోరణ పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షాకంకణ ధారణ, అఖండ దీపస్థాపన, నవగ్రహ సర్వతో భద్రమండప ఆవాహనాలు, యజ్ఞం పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'విజ్ఞానం'పై అవగాహన పెంచుకోవాలి

హన్మకొండ కల్చరల్: విద్యార్థులు జానపద గిరిజన విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్య బాబురావు సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఫాతిమా బీఈడీ కళాశాల విద్యార్థులు వరంగల్ హంటర్‌రోడ్డులోని తెలుగు విశ్వవిద్యాలయ జానపద గిరిజన విజ్ఞాన పీఠాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జానపదులు, గిరిజనుల వివరాలు, జీవనశైలి, జీవితచక్ర సంబురాలు వంటి పలు విషయాలను విద్యార్థులకు ప్రొఫెసర్ బాబురావు, పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు వివరించారు. అనంతరం విద్యార్థులు పీఠంలోని లైబ్రరీ, మ్యూజియంను సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరెపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, సిబ్బంది డాక్టర్ గంపా సతీష్, పరావస్తు విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R): 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O): 9177258410 (హన్మకొండ)